క్లుప్తంగా

'ఈటల'ను కలిసిన బీజేపీ నాయకులు



ఆత్మకూరు : తెలంగాణ బీజేపీ ఎన్నికల నిర్వహణ కమిటీ చైర్మన్‌గా నియమితులైన ఈటల రాజేందర్‌ను బీజేపీ నాయకులు మర్యాదపూర్వకంగా కలిశారు. బుధవారం హైదరాబాద్ శామీర్‌పేటలోని ఆయన నివాసం వద్ద బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడు, మండల కేంద్రానికి చెందిన ముత్యాల శ్రీనివాస్ కలిసి శాలువాతో సత్కరించి శుభాకాంక్షలు తెలిపారు.

ప్రధాని సభను విజయవంతం చేయాలి



ధర్మసాగర్: ఈ నెల 8న హనుమకొండలోని ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాల గ్రౌండ్‌లో బీజేపీ ఆధ్వర్యంలో నిర్వహించే ప్రధాని మోదీ సభను విజయవంతం చేయాలని బీజేపీ రాష్ట్రనాయకుడు గుండె విజయరామారావు పిలుపునిచ్చారు. మండల కేంద్రంలో ఆ పార్టీ మండల అధ్యక్షులు గంకిడి శ్రీనివాస్‌రెడ్డి ఆధ్వర్యంలో బుధవారం నిర్వహించిన సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. కార్యక్రమంలో పార్టీ నియోజకవర్గ కన్వీనర్ అంజిరెడ్డి, కో కన్వీనర్ గురిజాల వీరన్న, నాయకులు గాజుల సంపత్, గంకిడి వెంకట్‌రెడ్డి, శ్రీరాముల విజయ్, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

బాధితుడికి పరామర్శ

నడికూడ : మండలంలోని కంఠాత్మకూర్ గ్రామ కాంగ్రెస్ అధ్యక్షుడు భైరపాక భద్రయ్య సోమవారం రాత్రి గునిపర్తి గ్రామ శివారులో జరిగిన రోడ్డు ప్రమాదంలో గాయపడ్డాడు. హనుమకొండలోని ఓ ప్రైవేట్ హాస్పటల్‌లో చికిత్స పొందుతున్నాడు. విషయం తెలుసుకున్న పీసీసీ సభ్యుడు, కాంగ్రెస్ పరకాల నియోజకవర్గ ఇన్‌చార్జ్ ఇనగాల వెంకట్రామ్‌రెడ్డి బుధవారం పరామర్శించి మనోధైర్యం నింపి ఆర్థిక సాయం అందించారు.

డిజిటల్ లైబ్రరీలు ఏర్పాటు చేయాలి

శాయంపేట : నియోజకవర్గంలోని ప్రతి మండల కేంద్రంలో డిజిటల్ లైబ్రరీలు ఏర్పాటుచేసి విద్యార్థుల భవిష్యత్ బంగారు బాట వేయాలని స్వేరో స్టూడెంట్ యూనియన్ జిల్లా నాయకుడు మారెపెల్లి మనోజ్ బుధవారం పేర్కొన్నారు. భూపాలపల్లి నియోజకవర్గాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేస్తామని చెబుతున్న ఎమ్మెల్యే గండ్ర వెంకటరమణారెడ్డి, వరంగల్ జెడ్పీ చైర్‌పర్సన్ గండ్ర జ్యోతి అభివృద్ధితోపాటు విద్యార్థుల భవిష్యత్ కోసం గ్రామగ్రామాన జిమ్ సెంటర్లు, విద్యార్థులకు జ్ఞానాన్ని పెంపొందించేందుకు చేపట్టాలన్నారు.

భూమి పూజ



కమలాపూర్ : మండలంలోని ఉప్పల్ పెద్ద చెరువు కట్టపై రజకుల కుల దైవమైన శ్రీ మడేలయ్య దేవాలయం నిర్మాణానికి బుధవారం సర్పంచ్ ఎర్రబెల్లి దేవేందర్‌రావు, బీఆర్‌ఎస్ నాయకులు భూమిపూజ చేశారు. రూ.5 లక్షల ఎస్‌డీఎఫ్ నిధులతో ఈ పనులు చేపట్టినట్లు వారు తెలిపారు. కార్యక్రమంలో ఉపసర్పంచ్ మొర్రి ఓదెలు, కోఆప్షన్ సభ్యుడు చోటేమియా, బీఆర్‌ఎస్ రాష్ట్ర నాయకులు నాయినేని తిరుపతిరావు, మాజీ జెడ్పీటీసీ మారెపెల్లి నవీన్‌కుమార్, బీఆర్‌ఎస్ నాయకులు తూర్పాటి క్రాంతి, వార్డుసభ్యులు రజక సంఘం అధ్యక్షులు దర్మల శంకర్, ఉపాధ్యక్షులు పాల్గొన్నారు.

వీధికుక్కల పట్టివేత

ఖిలా వరంగల్: వరంగల్ 34వ డివిజన్ శివనగర్‌లో వీధికుక్కలు స్వైర విహారం చేస్తున్నాయి. దాంతో బయటికి వెళ్లేందుకు ప్రజలు భయాందోళనకు గురవుతున్నారు. వాహనాలపై వెళ్లే వారిని కూడా వదలడం లేదు. ఈక్రమంలో కుక్కల బెడదను అరికట్టాలని కార్పొరేటర్ దిడ్డి కుమారస్వామికి స్థానికులు విజ్ఞప్తి చేశారు.

కాంక్రీట్ ట్యాంకర్ ఢీకొని మాజీ ఎంపీటీసీ మృతి

పరకాల: పరకాల శివారులోని పెద్దకోడెపాక క్రాస్ వద్ద బుధవారం సాయంత్రం జరిగిన రోడ్డు ప్రమాదంలో శాయంపేట మండలం పెద్ద కోడెపాక మాజీ ఎంపీటీసీ మంద సమ్మయ్య(58) మృతిచెందాడు. కూరగాయల వ్యాపారం చేసుకుంటున్న సమ్మయ్య పరకాలకు వెళ్లి వస్తుండగా.. కాంక్రీట్‌తో వెళ్తున్న ట్యాంకర్ ఢీకొంది. స్థానికులు ఆయనను 108 వాహనం ద్వారా వరంగల్ ఎంజీఎంకి తరలించగా చికిత్స పొందుతూ రాత్రి మృతిచెందినట్లు పోలీసులు తెలిపారు. మృతుడి భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు పేర్కొన్నారు.

బీఆర్‌ఎస్ గెలుపే లక్ష్యంగా కృషి చేయాలి

- సర్పంచ్‌ల ఫోరం మండల అధ్యక్షుడు పెసరు రమేష్



సమావేశంలో మాట్లాడుతున్న పెసరు రమేష్

ధర్మసాగర్ : స్టేషన్‌ఘన్‌పూర్ నియోజకవర్గంలో రానున్న సాధారణ ఎన్నికల్లో బీఆర్‌ఎస్ అభ్యర్థిని భారీ మెజారిటీతో గెలిపించాలని సర్పంచ్‌ల ఫోరం మండల అధ్యక్షుడు పెసరు రమేష్ కోరారు. మండల కేంద్రంలో సర్పంచ్ ఎర్రబెల్లి శరత్ ఇంటి వద్ద బుధవారం పార్టీ ముఖ్య నాయకుల సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో రమేష్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని సూచించారు. ఈ నెల 8న మాజీ ఉపముఖ్యమంత్రి, ఎమ్మెల్సీ కడియం శ్రీహరి జన్మదిన వేడుకలను మండల కేంద్రంలో ఘనంగా నిర్వహించాలని నిర్ణయించినట్లు పేర్కొన్నారు. మండలంలోని వివిధ గ్రామాల ప్రజాప్రతినిధులు, బీఆర్‌ఎస్ శ్రేణులు, అభిమానులు అధిక సంఖ్యలో హాజరుకావాలని కోరారు. సమావేశంలో ప్రజాప్రతినిధులు, ముఖ్య నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

జీపీ సిబ్బంది సమస్యలు పరిష్కరించాలి



ఎంపీడీఓ రవీందర్‌కు నోటీసు అందజేస్తున్న జీపీ సిబ్బంది

దామెర : వివిధ గ్రామాల్లో పనిచేస్తున్న గ్రామపంచాయతీ సిబ్బంది సమస్యలు పరిష్కరించాలని పలువురు సిబ్బంది డిమాండ్ చేశారు. రాష్ట్ర వ్యాప్తంగా జీపీ సిబ్బంది గురువారం నుంచి తలపెట్టిన నిరవధిక సమ్మెకు సంబంధించిన నోటీసులను ఎంపీడీఓ రవీందర్, ఎస్సై ముత్యం రాజేందర్‌కు సమర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మల్టీపర్పస్ వర్కర్లకు, కారోబార్లకు ఉద్యోగ భద్రత కల్పించి ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలన్నారు. ప్రమాదవశాత్తు మరణించిన సిబ్బందికి ప్రమాద బీమా కింద రూ.10 లక్షలు చెల్లించాలని డిమాండ్ చేశారు. నోటీసులు సమర్పించిన వారిలో దండ్రె దేవేందర్, మాదారపు బొబ్బిలి, చిరంజీవి, రాజ్‌కుమార్, వెంకన్న, సుమన్, రమేష్, భద్రయ్య, నాగరాజు తదితరులు ఉన్నారు.

చికిత్స పొందుతున్న వ్యక్తి మృతి

ఎల్కతుర్తి : మద్యానికి బానిసై అప్పులు పెరగడంతో బాధ భరించలేక పురుగుల మందు సేవించిన వ్యక్తి ఆస్పత్రిలో చికిత్స పొందుతూ బుధవారం మృతి చెందాడు. ఈ సంఘటన భీమదేవరపల్లి మండలం రాంనగర్ అనుబంధ గ్రామమైన మంగళపల్లిలో చోటు చేసుకుంది. ఎస్సై నీలోజు వెంకటేశ్వర్లు తెలిపిన వివరాల ప్రకారం..గ్రామానికి చెందిన కడారి సదానందం(45) కూలీ పని చేసుకుంటూ కుటుంబాన్ని పోషిస్తున్నాడు. గత కొంతకాలంగా మద్యానికి బానిసై అప్పులు పెరిగిపోయాయి. దీంతో మనస్తాపం చెంది ఈనెల 4న పురుగుల మందు సేవించి కుటుంబ సభ్యులకు ఫోన్ ద్వారా చెప్పడంతో వెంటనే చికిత్స నిమిత్తం ఎంజీఎం ఆస్పత్రికి తరలించారు. చికిత్స పొందుతూ బుధవారం మృతి చెందినట్లు తెలిపారు. మృతుడి భార్య కవిత ఫిర్యాదు మేరకు ఎస్సై కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు. మృతుడికి కూతురు, కుమారుడు ఉన్నారు.

'తుమ్మ చెట్లు అమ్ముకున్నారు'

సంగెం : చెరువు కట్టపై ఉన్న తుమ్మ చెట్లను అమ్ముకున్నారని లోహిత వార్డు సభ్యుడు ల్యాదల్ల రమణ ఆరోపించారు. సర్పంచ్ భర్త నాగినేని జగన్‌మోహన్‌రావు, ఉప సర్పంచ్ కోలా రాజు, కారోబార్ బొమ్మెర రవి ఊర చెరువు కట్టపై గల 20 తుమ్మ చెట్లను వేలం వేసి రూ.56 వేలకు అమ్ముకున్నారని ఆరోపించారు. ఈ విషయంపై సర్పంచ్‌ను వివరణ కోరగా గ్రామస్తులు, ప్రజాప్రతినిధుల సమక్షంలోనే తుమ్మ చెట్ల వేలం పాట నిర్వహించామన్నారు. గతేడాది తుమ్మ చెట్లను అమ్మిన రూ.45 వేలను గ్రామపంచాయతీలో జమ చేయలేదని ఆరోపించారు. చెట్లను అమ్మిన డబ్బులు జీపిలో జమ చేసి లెక్కలు చూపించాలని డిమాండ్ చేశారు.

ఘనంగా తిరుగువారం పండుగ



తిరుగువారం వేడుకల్లో పాల్గొన్న ఎమ్మెల్సీ కౌశిక్‌రెడ్డి

కమలాపూర్ : మండలంలోని వంగపల్లి గ్రామంలో బీరప్ప గుడి తిరుగువారం పండుగను బుధవారం ఘనంగా నిర్వహించారు. వేడుకల్లో ఎమ్మెల్సీ పాడి కౌశిక్‌రెడ్డి పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. అలాగే ఉప్పల్‌లో బీరన్న బోనాలు వేడుకలు ఘనంగా జరుపు కున్నారు. కార్యక్రమంలో సర్పంచ్‌లు ఓడేటి కమ్మలమ్మ సారయ్య, దేవేందర్‌రావు, ఎంపీటీసీలు ఇంజపెల్లి రామస్వామి, సంపత్‌రావు, మాజీ జెడ్పీటీసీ నవీన్‌కుమార్, వార్డు సభ్యులు, బీఆర్‌ఎస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

నాయకత్వ లోపంతోనే పార్టీ బలహీనం



మాట్లాడుతున్న నాయకులు, ప్రజాప్రతినిధులు

గీసుకొండ : పరకాల నియోజకవర్గంతో పాటు గీసుకొండ మండలంలో పార్టీని బలోపేతం చేసే నాయకత్వం లేకపోవడం వల్లే ఎంపీపీ బీమగాని సౌజన్యపై అవిశ్వాస తీర్మానం ప్రవేశపెట్టడంతో పాటు ఇద్దరు కాంగ్రెస్ ఎంపీటీసీలు ప్లేటు ఫిరాయించారని కాంగ్రెస్ మండల నాయకులు, ప్రజాప్రతినిధులు అన్నారు. బుధవారం మండలంలోని కోటగండి వద్ద విలేకరుల సమావేశంలో కొమ్మాల ఎంపీటీసీ మణిగోపాల్, మండల కోఆప్షన్ సభ్యులు ఎండీ రహీం, మండల ప్రధాన కార్యదర్శి అప్పని కరుణాకర్, పలువురు నాయకులు మాట్లాడారు. పరకాల నియోజకవర్గ ఇన్‌చార్జ్ ఇనగాల వెంకట్రాంరెడ్డి అలసత్వం వల్లే పార్టీ బలహీన పడుతోందని, పార్టీనుంచి చేజారుతున్న వారిని రక్షించుకునేందుకు ఆయన ఎలాంటి ప్రయత్నం చేయడం లేదని ఆరోపించారు. ఇలాంటి పరిస్థితిలో ఏం చేయాలో తోచని స్థితిలో ఉన్నామన్నారు. మండల నాయకులు నాగర బోయిన సారంగం, అమిరిశెట్టి రాజు, నాగారపు స్వామి, మర్రి క్రాంతి కుమార్, వాంకుడోత్ చెవ్లా నాయక్, కొండా మధు, సిరిసె రాజు పాల్గొన్నారు.

రైతులను మోసం చేసిన ప్రభుత్వం

గీసుకొండ : గీసుకొండ-సంగెం మండలాల పరిధిలో ఏర్పాటైన కాకతీయ మెగా టెక్స్‌టైల్ పార్కు(కేఎంటీపీ)కి తక్కువ ధరకు భూములిచ్చిన రైతులను ప్రభుత్వం మోసం చేసిందని టీడీపీ పరకాల నియోజకవర్గ ఇన్‌చార్జ్ గన్నోజు శ్రీనివాసాచారి ఆరోపించారు. బుధవారం మండలంలోని గీసుకొండ, కొనాయమాకులలో ఇంటింటికి గన్నోజు కార్యక్రమంలో భాగంగా ఆయన పర్యటించారు.

మతిస్థిమితం సరిగా లేని మహిళ ఆత్మహత్య

మడికొండ: మతిస్థిమితం సరిగాలేని వివాహిత బావిలో దూకి ఆత్మహత్య చేసుకున్న సంఘటన రాంపేట గ్రామంలో జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం జక్కుల రేణుక (50) హసన్‌పర్తి మండలం భీమారం గ్రామానికి చెందిన జక్కుల కొమురయ్య, రేణుకకు 30 ఏళ్ల క్రితం వివాహం అయింది. వారికి ఇద్దరు కుమారులు ఉన్నారు. గత ఐదేళ్ల నుంచి రేణుక మతిస్థిమితం కోల్పోయి భయ భ్రాంతులకు గురవుతుండేది. మంగళవారం సాయంత్రం ఇంట్లో ఎవరికి చెప్పకుండా బయటకు వెళ్లిపోయింది. ఆచూకీ కోసం వెతకగా వ్యవసాయ బావిలో ఆమె మృతదేహం కనబడింది. కుటుంబీకుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై నర్సింగరావు తెలిపారు.

నలుగురికి గాయాలు

మామునూరు: వరంగల్ – ఖమ్మం జాతీయ రహదారిపై టీఎస్‌ఎస్పీ నాలుగో బెటాలియన్ పెట్రోల్ బంక్ సమీపంలో బుధవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో నలుగురు స్వల్ప గాయాలతో బయటపడ్డారు. స్థానికుల కథనం ప్రకారం.. హనుమకొండ జిల్లా కోమటిపెల్లి గ్రామానికి చెందిన నలుగురు ఖమ్మం నుంచి వరంగల్‌కు కారులో బయల్దేరారు. ఈక్రమంలో ఖమ్మం జాతీయ రహదారిపై టీఎస్‌ఎస్పీ బెటాలియన్ పెట్రోల్ బంక్ సమీపంలోకి చేరుకోగానే రోడ్డుపై నిలిచి ఉన్న టిప్పర్‌ను కారుతో వెనుక భాగాన ఢీకొట్టారు. దాంతో కారులో ప్రయాణిస్తున్న నలుగురు స్వల్ప గాయాలతో బయటపడ్డారు.

మోదీ సభకు భారీగా తరలిరావాలి

ఖిలా వరంగల్: ప్రధాని నరేంద్ర మోదీ సభకు భారీగా ప్రజలు తరలివచ్చి విజయవంతం చేయాలని బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు కుసుమ సతీష్, జిల్లా అధ్యక్షుడు కొండేటి శ్రీధర్ పిలుపునిచ్చారు. ఈమేరకు వరంగల్ శివనగర్‌లోని ఫోర్ట్‌రోడ్డుపై ప్రచార రథాలను వారు జెండా ఊపి బుధవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రధాని మోదీ పాలనతో దేశాన్ని ప్రపంచంలోనే మొదటి స్థానంలో నిలిపారని వివరించారు. ఈనెల 8న హనుమకొండలోని ఆర్ట్స్ కళాశాల మైదానంలో జరగనున్న బహిరంగ సభకు కార్యకర్తలు తరలిరావాలని కోరారు. కార్యక్రమంలో రత్నం సతీష్, రంజిత్, రఘునారెడ్డి, హరిశంకర్, సిద్దం నరేష్, అచ్చ విద్యాసాగర్, వెంకటరమణ, రాంబాబు, సత్యనారాయణ, బైరి శ్యాం పాల్గొన్నారు.

మోదీ సభను విజయవంతం చేయాలి

కాజీపేట: పీఎం నరేంద్రమోదీ వరంగల్ జిల్లా పర్యటనను విజయవంతం చేయాలని బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడు చిర్ర నర్సింగ్ గౌడ్ కోరారు. ఈమేరకు కాజీపేట మండలం సోమిడి గ్రామంలో నర్సింగ్ ఆధ్వర్యంలో కార్యకర్తలు బుధవారం ఇంటింటి ప్రచారం నిర్వహించారు. దేశంలోనే రెండో అతిపెద్ద రైల్వే ప్రాజెక్టుకు శంకుస్థాపన చేయడానికి ఈనెల జిల్లాకు 8న ప్రధాని వస్తున్న నేపథ్యంలో ప్రజలు భారీగా తరలిరావాలని సూచించారు. కార్యక్రమంలో డివిజన్ అధ్యక్షుడు భగవాన్ దాస్ పాల్గొన్నారు.

కేయూలో కాంట్రాక్టు లెక్చరర్ల ధర్నా



ఎమ్మెల్సీ రాజేశ్వర్‌రెడ్డికి వినతిపత్రం అందజేస్తూ..

కేయూ క్యాంపస్: రాష్ట్రంలో 13 యూనివర్సిటీల్లో పనిచేస్తున్న కాంట్రాక్టు లెక్చరర్లను రెగ్యులరైజ్ చేయాలని కాంట్రాక్టు టీచర్స్ అసోసియేషన్ (కుక్టా) జేఏసీ నాయకులు డిమాండ్ చేశారు. ఈమేరకు కాకతీయ యూనివర్సిటీలోని కోఎడ్యుకేషన్ ఇంజనీరింగ్ కళాశాల ఎదుట బుధవారం ధర్నా నిర్వహించారు. ఆల్ యూనివర్సిటీస్ కాంట్రాక్టు టీచర్స్ జేఏసీ చైర్మన్ డాక్టర్ శ్రీధర్‌కుమార్ లోథ్, కుక్టా బాధ్యులు భిక్షపతి, మధుకర్‌రావు, చీకటి శ్రీనివాస్, గజ్జల మల్లేష్, సత్య, కల్పన, స్వప్న, మంజుల, శ్రీధర్‌రావు, సౌజన్య, ప్రియాంక పాల్గొన్నారు.

రెగ్యులరైజ్ చేయాలని వినతి

రాష్ట్రంలోని అన్ని యూనివర్సిటీల్లోని పార్ట్‌టైం లెక్చరర్లుగా పనిచేస్తున్న వారిని రెగ్యులరైజ్ చేయాలని తెలంగాణలోని పలు యూనివర్సిటీల పార్ట్‌టైం లెక్చరర్ల అసోసియేషన్ బాధ్యులు కోరారు. ఈమేరకు హైదరాబాద్‌లో ఎమ్మెల్సీ పల్లా రాజేశ్వర్‌రెడ్డిని బుధవారం కలిసి వినతిపత్రం అందజేశారు. అలాగే, ఉన్నత విద్యామండలి చైర్మన్ ప్రొఫెసర్ లింబాద్రిని కలిసి విజ్ఞప్తి చేశారు.

పాఠశాలకు ల్యాప్‌టాప్‌ల బహూకరణ



ల్యాప్‌టాప్‌లను అందజేస్తున్న సీఐ మహేందర్

వరంగల్: ఆరెపల్లి ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు ఎన్‌ఆర్‌ఐ వంగపాటి రాజశేఖర్‌రెడ్డి రూ.1.50 లక్షల విలువైన రెండు ల్యాప్‌టాప్‌లను ఏనుమాముల ఇన్‌స్పెక్టర్ మహేందర్ చేతుల మీదుగా బుధవారం అందజేశారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ సొసైటీ ఫర్ ఎంపవర్‌మెంట్ స్కిల్స్ గ్లోబల్లి అనే సంస్థను వరంగల్‌లో ఏర్పాటు చేసి సంస్థ ద్వారా అనేక విద్యా సంబంధ సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కంప్యూటర్ ద్వారా పేద విద్యార్థులు విద్య నేర్చుకునేందుకు పాఠశాలకు ల్యాప్‌టాప్ అందించిన రాజశేఖరరెడ్డిని అభినందించారు. కార్యక్రమంలో పాఠశాల హెచ్‌ఎం నాగేశ్వరరావు, బుద్దె శ్రీనివాస్, సంస్థ జిల్లా కార్యదర్శి సువర్చల, ఎస్‌ఎంసీ చైర్మన్లు స్వరూప, మంజుల ఉపాధ్యాయులు మున్ని, తిరుమల తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు నోట్ బుక్స్ పంపిణీ



నోట్‌బుక్స్ పంపిణీ చేసిన పూర్వ విద్యార్థి వెంకటేశ్వర్లు

రామన్నపేట: వరంగల్‌లోని ఏవీవీ పాఠశాల విద్యార్థులకు పాఠశాల పూర్వ విద్యార్థి, వ్యాపారవేత్త గర్రెపల్లి వెంకటేశ్వర్లు చేయూతనిచ్చారు. ఈమేరకు రూ.5,500 విలువగల నోట్ పుస్తకాలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో విద్యా సంస్థల శాశ్వత సభ్యులు చందా శ్రీకాంత్, ప్రిన్సిపాల్ భుజేందర్, పూర్వ ప్రధానోపాధ్యాయులు వాసుదేవులు, ఉపాధ్యాయులు నవీన్, విజయలక్ష్మి, వాసంతి, భాగ్యలక్ష్మి, వీరేశలింగం, వెంకటేశ్వర్లు, రమాదేవి పాల్గొన్నారు.

సీఎంఆర్‌ఎఫ్ పేదల పాలిట వరం



ఎల్‌ఓసీ అందజేస్తున్న ఎమ్మెల్యే ధర్మారెడ్డి

దామెర: సీఎం రిలీఫ్ ఫండ్ నిరుపేదల పాలిట వరమని పరకాల ఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డి అన్నారు. మండలంలోని ఊరుగొండ గ్రామానికి చెందిన నాసబోయిన చేరాలు అనారోగ్యానికి గురికాగా హైదరాబాద్ నిమ్స్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నాడు. కాగా అతడికి రూ.లక్ష ఎల్‌ఓసీ మంజూరు కాగా వారి కుటుంబ సభ్యులకు బుధవారం ఎమ్మెల్యే అందజేశారు. ఆయన వెంట సర్పంచ్ గోగుల సత్యనారాయణరెడ్డి, బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు గండు రాము, గోగుల వీరారెడ్డి, పోలెపాక అర్జున్ తదితరులు పాల్గొన్నారు.

రైతు వేదికలో చోరీకి యత్నం

శాయంపేట : శాయంపేట గ్రామ రైతు వేదికలోని వ్యవసాయ విస్తరణ అధికారి చాంబర్‌లో గుర్తుతెలియని వ్యక్తి చోరీకి పాల్పడిన సంఘటన మంగళవారం రాత్రి చోటు చేసుకుంది. ఈ ఘటనలో ఎలాంటి వస్తువులు దొంగతనం జరగకపోవడంతో అధికారులు ఊపిరి పీల్చుకున్నారు. రైతు వేదికలో వ్యవసాయ విస్తరణ అధికారి స్టెల్లా చాంబర్‌లో ఉన్న గ్లాస్ కిటికీ ఆటోమెటిక్ లాక్ పనిచేయకపోవడంతో, ఒక పక్క గ్లాస్ డోర్, మరోపక్క మెష్ జాలివేసి లాక్ చేశారు. బుధవారం ఉదయం 10 గంటలకు ఏఈఓ రైతువేదిక వద్దకు విధులకు హాజరు కాగా ఆమె చాంబర్‌లోని కిటికీ మెష్ జాలి కట్ చేసి కనిపించింది. ప్రభుత్వం జారీ చేసిన వాల్‌పోస్టర్లు చింపి ఉండడం, బీరువా తలుపులు పగలగొట్టడానికి యత్నం చేసిన ఆనవాళ్లు ఉన్నాయి. వెంటనే మండల వ్యవసాయాధికారి గంగాజమునకు సమాచారం అందించడంతో వెంటనే చేరుకుని పరిశీలించి పోలీసులకు సమాచారం అందించారు. పోలీసులు ఘటనాస్థలానికి చేరుకొని పరిశీలించారు. రైతు వేదిక సమీపంలో మద్యం దుకాణం ఉండడంతో మందుబాబులే ఈ ఘటనకు పాల్పడి ఉంటారని రైతులు చర్చించుకోవడం గమనార్హం.

మొక్కల పెంపకంపై దృష్టి సారించాలి



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీడీఓ శ్రీనివాస్‌రెడ్డి

ఆత్మకూరు : గ్రామాల్లో మొక్కల పెంపకంపై పంచాయతీ కార్యదర్శులు ప్రత్యేక దృష్టి సారించాలని ఎంపీడీఓ శ్రీనివాస్‌రెడ్డి సూచించారు. బుధవారం మండల పరిషత్ కార్యాలయంలో కార్యదర్శులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నర్సరీల్లో మొక్కల నిర్వహణలో ఎలాంటి ఇబ్బందులు లేకుండా చూడాలన్నారు. త్వరలో ఇంటింటికీ మొక్కల పంపిణీ చేసే విధంగా ప్రణాళిక రూపొందించుకోవాలని సూచించారు. రహదారులకు ఇరువైపులా మొక్కలు నాటాలని తెలిపారు. పాఠశాలల్లో, కాలనీలో వర్షపు నీరు నిలవకుండా ఎప్పటికప్పుడు సిబ్బందితో పారిశుద్ధ్య పనులు చేపట్టాలని సూచించారు. కార్యక్రమంలో ఎంపీఓ చేతన్‌కుమార్‌రెడ్డి, ఏపీఓ రాజిరెడ్డి, కార్యదర్శులు రాజేందర్, యాదగిరి, శ్రీకాంత్, బుచ్చిరెడ్డి, జితేందర్‌రెడ్డి, క్రాంతికుమార్, సతీష్, మోహన్‌రావు, సంపూర్ణ, సుజన, సంధ్య, అనూష, తదితరులు పాల్గొన్నారు.

చెరువులో మట్టి అక్రమ తవ్వకాలను ఆపాలి

- ఆర్డీఓకు ఫిర్యాదు చేసిన బీజేపీ నాయకులు



ఆర్డీఓకు వినతిపత్రం అందజేస్తున్న బీజేపీ నాయకులు



చెరువు మత్తడి కాల్వ పనులను పరిశీలిస్తున్న మున్సిపల్ అధికారులు

పరకాల : అభివృద్ధి పేరిట పరకాలలోని దామెర చెరువులో జరుగుతున్న మట్టి అక్రమ తవ్వకాలకు అడ్డుకట్ట వేయాలని బీజేపీ పరకాల పట్టణ అధ్యక్షుడు మార్త భిక్షపతి డిమాండ్ చేశారు. ఆర్డీఓ కార్యాలయ పరిపాలన అధికారి సంధ్యారాణికి బుధవారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చెరువును లోతు చేయాలనే నిర్ణయంతో వందలాది ట్రాక్టర్‌లతో మట్టి తవ్వకాలు చేపట్టడం జరుగుతుందన్నారు. ఆ మట్టిని రైతులకు విక్రయించాల్సి ఉండగా బీఆర్‌ఎస్ ప్రజాప్రతినిధులే బయట వ్యక్తులకు అమ్ముకుంటున్నారని ఆరోపించారు. కార్యక్రమంలో కౌన్సిలర్ కొలనుపాక భద్రయ్య, పార్టీ పట్టణ ప్రధాన కార్యదర్శి గాజుల నిరంజన్, ఉపాధ్యక్షుడు సంఘ పురుషోత్తం, పట్టణ నాయకులు మంతెన సంతోష్, బండారి కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

చెరువు మత్తడి కాల్వపనుల పరిశీలన

పట్టణంలో దామెర చెరువు మత్తడి కాల్వ పనులను మున్సిపల్ అధికారులతో పాటు మున్సిపల్ పాలకవర్గ సభ్యులు బుధవారం పరిశీలించారు. వర్షాకాలం ప్రారంభమైనందున పనులను వేగవంతంగా పూర్తి చేయాలని అధికారులను మున్సిపల్ పాలకవర్గ సభ్యులు కోరారు. పరిశీలించిన వారిలో మునిసిపల్ వైస్ చైర్మన్ రేగూరి విజయపాల్‌రెడ్డి, దళిత బంధు కమిటీ కన్వీనర్ సోదా రామకృష్ణ, మున్సిపల్ ఏఈ వంశీ, కౌన్సిలర్లు పూర్ణాచారి, రాజు, బీఆర్‌ఎస్ నాయకులు అనిల్‌కుమార్, కృష్ణ పాల్గొన్నారు.

బీఆర్‌ఎస్, బీజేపీ నుంచి కాంగ్రెస్‌లో చేరిక



కాంగ్రెస్‌లో చేరిన బీజేపీ, బీఆర్‌ఎస్ నాయకులు

వరంగల్ చౌరస్తా / ఖిలా వరంగల్: వరంగల్ 28వ డివిజన్‌కు చెందిన బీఆర్‌ఎస్, బీజేపీకి చెందిన నాయకులు, కార్యకర్తలు కాంగ్రెస్ పార్టీలో చేరారు. వరంగల్‌లో కాంగ్రెస్ నాయకుడు కరాటే ప్రభాకర్ ఆధ్వర్యంలో వరంగల్ జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షురాలు ఎర్రబెల్లి స్వర్ణ సమక్షంలో బుధవారం చేరారు. ఈక్రమంలో వారికి కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. కార్యక్రమంలో మాజీ డిప్యూటీ మేయర్ ఎంబాడి రవీందర్, కాంగ్రెస్ నాయకులు అయూబ్ జన్ను రవి, గొల్లన రవి, బాషుపాక సదానందం, గజ్జల లింగమూర్తి, జన్ను వేణు, కోదాటి అనిల్, కాశీ, రాందేవ్, యాదగిరి, గిన్నారం రాజు, జన్ను ఆదాం, దినేష్, అజాముల్ ఖాన్, మహముద్ పాషా, యాట వీర ప్రతాప్, రాజు, కుసుమ రవి, సునీత, రావుల భూపాల్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

బాధిత కుటుంబానికి పరామర్శ

మడికొండ: కాజీపేట మండలం టేకులగూడెం గ్రామానికి చెందిన బండి సమ్మయ్య (55) మృతి చెందాడు. కాగా, బాధిత కుటుంబ సభ్యులను డీసీసీబీ మాజీ చైర్మన్ జంగా రాఘవరెడ్డి బుధవారం పరామర్శించారు. అంత్యక్రియల నిమిత్తం ఆర్థిక సాయం అందజేసినట్లు రాఘవరెడ్డి తెలిపారు. ఈ కార్యక్రమంలో పీఏసీఎస్ డైరెక్టర్ నరేందర్ రెడ్డి, నాయకులు నరోత్తంరెడ్డి, జగదీశ్వర్‌రెడ్డి, బండి రాజు తదితరులు పాల్గొన్నారు.

కాశిబుగ్గ వీకర్స్ సెక్షన్ కాలనీలో..

కాశిబుగ్గ: ఇటీవల మృతి చెందిన పలు బాధిత కుటుంబాలను బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు, వరంగల్ అర్బన్ కోఆపరేటివ్ బ్యాంక్ చైర్మన్ ఎర్రబెల్లి ప్రదీప్‌రావు బుధవారం పరామర్శించారు. కాశిబుగ్గ వీకర్స్ సెక్షన్ కాలనీకి చెందిన ఐదుగురు కుటుంబ సభ్యులు రోడ్డు ప్రమాదంలో మృతి చెందగా, వారి నివాసానికి వెళ్లి కుటుంబ సభ్యులు ప్రదీప్‌రావు ఓదార్చారు. తిలక్ రోడ్డులో సదానందం కుటుంబ సభ్యులకు ధైర్యం చెప్పారు.

సాక్షి
సాక్షి దినపత్రికలో ప్రకటనల కోసం మీ ప్రాంతంలో మా ప్రతినిధులు అందుబాటులో ఉన్నారు.
వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు
వ్యాపార, ఉద్యోగ, బహిరంగ ప్రకటనలు
శ్రద్ధాంజలి, నిర్యాణము, వర్ధంతి మొదలగు
అన్ని రకాల ప్రకటనలు ఇవ్వదలిచిన వారు సంప్రదించండి.
వరంగల్ అర్బన్:
9951602875 9505507575
9010299096 9553955722
Office mail : wglsakshiadvt@gmail.com

సాక్షి
పాఠక మహాశయులకు విజ్ఞప్తి
మీకు సాక్షి దినపత్రిక అందడంలో ఏమైనా ఇబ్బందులున్నా లేక సాక్షికి బదులుగా ఇతర దిన పత్రికలు వేస్తున్న యెడల ఈ ఫోన్ నంబర్లకు ఉదయం 7.00 గం॥ల నుండి రాత్రి 8.00 గం॥ల లోపు తెలుపగలరు. వెంటనే తగు చర్యలు తీసుకోబడును.
వి.రాజ్‌కుమార్ (S.R) : 9966290903 (ఎల్కతుర్తి)
పి.చంద్రశేఖర్ (A.C.O) : 8074606274